# మాలిమ

-పురిజాల సుధాకర్

బాల్యంలో పడిన ముద్రలుగానీ, అనుభూతులగానీ, అనుభవాలుగానీ జీవితాంతం ఉంటాయంటారు.

నిజమే- తెల్లటి దూడతో ఆడుకున్న ఆ రోజులు-

ఆ పల్లెటూళ్ళో గడిపిన ఆరోజులు-

తలుచుకుంటే ఓ పక్క ఆనందం కలుగుతుంది.

ఇంకోపక్క విషాదమూ మిగులుతుంది.

నేను ఎనిమిదో తరగతి చదువుతుండే రోజుల్లో నాతోపాటు ఒక దూడ ఉండేది.

దానినుదిటి మీద నల్లటి మచ్చ ఎంతో ముచ్చటగా ఉండేది.

ఆ లేగదూడంటే అప్పట్లో నాకెంతో ఇష్టం. స్కూల్‌నుండి వచ్చిన వెంటనే పెరట్లోకి వెళ్ళేవాడిని.

దానిదగ్గరకు వెళ్ళిన తక్షణం అది నాచేతిని నాకుతుండేది. నన్ను దువ్వమని దాని మెడను ఎత్తేది.

దానికన్నె విప్పేసినాక చెంగుచెంగున దూకుతూంటే కాసేపు పరుగెత్తించేవాడిని. నేనూ పరుగెత్తేవాడిని. ఇదీ ఒక సంవత్సరం వరకూ నా దినచర్య.

★ ★ ★

మాది పెద్ద కుటుంబం. ఆరుగురం అన్నదమ్ములం. ఒక్కగానొక్క చెల్లి. అమ్మా నాన్నా అంతా కలసి ఇంట్లో తొమ్మండుగురం.

ఇల్లంతా ఎంత కళకళ లాడేదో అలాగే హాలంతా కూడా కళకళలాడేది.

వర్షాలు పడితే అవి ఎక్కడ తడిసి ఇబ్బంది పడతాయేమోనని, నేనూ వర్మ కలిసి మొట్టమొదటిగా రాటలుపాతి, శాలవేశాం. వర్మ అంటే నా బాల్యమిత్రుడు.

ఇల్లంతా పాడితో నిండిఉండేది.

ఎండలో ఎవరైనా వస్తేచాలు... చక్కగా చిక్కటి మజ్జిగ కలిపి ఇచ్చేది అమ్మ.

అమ్మకు ఆవులంటే ప్రాణం. ఎప్పుడూ ఆవులకు సేవలు చేస్తూ, వాటితోనే గడిపేది.

ఆరోజునే నేడు-

కానీ-

కాలంలో మార్పులు వచ్చాయి.

అగ్రహారాలన్నీ సమూలంగా పోయి ఆఖరికి అగ్రవర్ణం వాళ్ళు మా కుటుంబంలాగే... ఒక్కరో... ఇద్దరో మిగిలారు.

అయితే- అందరూ ఉద్యోగాలు పట్నాల్లో చూసుకొని వెళ్ళిపోతే-

మా నాన్నగారు మాత్రం పట్నం నుంచి ఇదిగో మా స్వగ్రామానికి ఈడ్చుకొచ్చేసారు.




దానికి కారణం - మా నాన్నగారి ఒక్కరి జీతంతో పట్నంలో గడవడం 'కష్టం' గద-

అప్పట్లో అవేవీ తెలిసేవికావు.

మేం, ఎంతో బుద్ధిగానే పెరిగాం.

కానీ-

పెరట్లో ఆవుల సంఖ్య పెరగటంతో అసలు సమస్యలు పెరిగాయి.

వాటికి గడ్డి కొంటే ఆరునెలల్లో అయిపోయేది.

అవి కట్లు తెంపేసి నాయుళ్ళ పొలాలలో పడితే వాటిని కొట్టడం, మమ్మల్ని తిట్టడం, ఆఖరికి రామ మందిరం దగ్గరున్న బందుల దొడ్డిలో కట్టడం! జరిమానాలు వేయడం- నానా బాధలూపడి వాటిని విడిపించుకు రావడం, అయినా సరే- మళ్ళీ అవితెంపుకు పోవడం-

ఆఖరికి ప్రాణం విసిగిపోయింది నాన్నగార్కి-

నాన్నగారు ఓ రోజు ఏం చేసారంటే - రెండు దూడల్ని ఎనభై రూపాయల చొప్పున అమ్మేశారు.

ప్రాణం ఉసూరు మంది.

ఎందుకంటే, ఆ మొట్టమొదటి దూడ సంతానంలో అప్పుడే రెండింటిని అమ్మేసినందుకు-

అయినా-

ఇంట్లో వాళ్ళనే పోషించలేక చస్తూంటే పెరట్లో వాటిని మాత్రం ఎంతకని పోషిస్తారని?

ఇంకా ఏడు మాత్రం మిగిలాయి.

ఎర్రావుకి...గొప్పకోపం. దాన్ని ఎవరైనా కొనడానికి వస్తే చాలు, రాట చుట్టూరా తెగతిరిగేది. దాని లేతదూడ నుదిటిని తెగ నాకేది.

ఓసారి-

నాయుడు వాళ్ళు చాలాదుర్మార్గంగా-

ఇంటి మీదకి వచ్చి ఏవో తిట్టారు.

లేనిపోని మాటలు అన్నారు.

అమ్మవాళ్ళని బ్రతిమాలుకుంది.

ఆఖరిగా-

ఓ రాత్రి-

ఏదో పెళ్ళి బండితోటి-

మరో రెండు దూడల్ని కట్టేసి ఏ అర్ధరాత్రో తీసుకు పోయారు.

అవి ఎలా పోయాయో అని ఊళ్ళో పెద్ద మనుషుల్ని అడిగితే ఎవ్వరూ న్యాయం చెప్పలేదు.

సుమారుగా ఊరంతా ఒకే కులంవారు కావడంతో కులకట్టు పాటించి, ఆ దూడల విషయం చెప్పారు కారు.

తిరగబడాలని అనుకున్నాం ఓసారి, మా అన్నదమ్ములం.

అలాగే ఓసారి-

మా తమ్ముడు మిగిలిన అయిదింటిని మేపుతూ వస్తున్నప్పుడు, ఎవరో మా ఆవుని కొడితే తిరగబడ్డాడు. కొడవలితో చేతులపై కోసేసాడు-

అది చాలా పెద్ద గొడవ అయింది.

రామమందిరం దగ్గర పెద్ద తగువయ్యింది.

ఆఖరిగా-

నాన్నగారు, ఆ వేళ్ళు తెగిన అబ్బాయికి వైద్యం చేశారు.

ఆ తర్వాత-

మా పశువుల ఊసుకొన్నాళ్ళు పట్టలేదు ఎవ్వరికీ.

కానీ-

నిఘా వేసి ఉంచారు.

మా తమ్ముడే వాటిని కాస్తుండడంతో కాస్త క్రమశిక్షణలో పడి... ఇతరుల పొలంలో పడడం మానేసాయి.

క్రమక్రమంగా కాస్త బలవడం మొదలుపెట్టాయి.

అమ్మ తమ్ముణ్ణి మెచ్చుకునేది.

కనీసం-

ఆ అయిదు ఆవులు మళ్ళీ తప్పక శాలను అభివృద్ధి చేస్తాయని అనుకుంది!

కానీ-

ఆ రాత్రి-

మా తమ్ముడు శాలలో కాపలా పడుకోలేదు.

ఆ రాత్రికి రాత్రి కొందరు దుర్మార్గులు ఆవులన్నిటినీ పట్టుకు పోయారు.

తెల్లారి చూద్దుం కదా-

శాలంతా బోసి పోయింది.

అమ్మ గుండెలు బాదుకుంది.

మేమంతా బాధపడ్డాం.

అంతలో- 'అంబా... అంబా' అని అరుచుకుంటూ నా చిన్నప్పటి దూడ (ఆవు) వచ్చింది.

ఆఖరిగా అదొక్కటే మిగిలింది.

మాకు ఎంతో ఆత్మీయంగా ఉన్న ఆ ఆవుని చివరిగా దేవుడు మాకు మిగిల్చాడు అనుకున్నాం.

మిగిలిన నాలుగింటి కోసం మా అన్నదమ్ములం వెదికాం. ఎన్నెన్నో ఊళ్ళు తిరిగాం.

కానీ-

మా ఆవులు-

ఏ ఊళ్ళోనూ కనబడలేదు.

నిరాశగా ఇంటికి వచ్చేశాం.

ఆ విషయాన్ని క్రమేపీ మర్చిపోయాం.

అంతకంటే ఏం చెయ్యగలం ఆ పరిస్థితుల్లో-

అమ్మా నాన్నా తమ బాధ్యతను ఎంతో సక్రమంగా నిర్వర్తించి మమ్మల్ని మంచి చదువులు చదివించారు.

నేను మంచి ఉద్యోగంలో సెటిల్ అయ్యాను.

అప్ అండ్ డౌన్ చేస్తున్నాను.

ఈ రూట్లో-

కొన్ని వందల బక్కచిక్కిన ఆవుల్ని చెట్ల క్రింద చూస్తున్నాను.

బస్‌లో అతన్ని కదిపాను.

"ఏమిటీ ఆవులు? ఎందుకిలా ఉన్నాయి?"

"అయ్యా... ఈ ఆవులు చేలలోపడి వ్యవసాయాలు పాడుచేస్తూంటే కొంతమంది మోతుబరి రైతులు అతిచవగ్గా వాటిని తెచ్చి అమ్మేస్తారు. ఇక్కడి నుండి ఇవి అదిగో ఆ లారీల్లో కలకత్తా వెళ్ళిపోతాయి. కరెంట్‌షాక్‌తో వాటిని చంపేస్తారు.

వాటి తోళ్ళు వలచి వ్యాపారం చేస్తారు. వీటి ఎముకల్ని పొడి చేస్తారు.

వీటి మాంసం చక్కటి టిన్స్‌లో సీల్‌చేసి చాలా ఖరీదుకు విదేశాలకు ఎగుమతి చేస్తారు.

ఒకప్పుడు 'గోబ్రాహ్మణేభ్యశ్శుభమస్తు నిత్యం. లోకా: సమస్తా: సుఖినో భవన్తు...' అని... గోవుల్నీ, బ్రాహ్మల్నీ శుభ్రంగా ఉంచేవారట. కాని, ఇప్పుడు గోవుల పరిస్థితి, బ్రాహ్మణుల పరిస్థితీ అలానే ఉంది." పశువులన్ని ఎక్కిస్తోన్న లారీ వంక చూపుతూ అన్నాడతను.

అంతలో బస్ స్టార్ట్ అయిపోయింది.

ఆఖరిగా మిగిలిన ఒక ఆవూ ఏదో జబ్బుపడి ఆహారం అసలు నెలరోజులవరకూ ముట్టకోకుండా చచ్చిపోయింది.

అంటే-

అప్పుడు ఆ పల్లెటూళ్ళో మోతుబరిరైతులూ ఇలాగే మా ఆవుల్నీ తెచ్చి అమ్మేసారేమో!

నా కళ్ళెంట అశ్రువులు.

నన్ను చూసిన తను '8అదేంటి? అలా బాధపడుతున్నారూ?" అనడిగాడు.

ఉత్తరగోగ్రహణం జరిగితే అర్జునుడు ఎందుకు వాటిని వెనక్కి తెచ్చేడట. కానీ, ఇదిగో రోజూ జరిగే ఈ దారుణ గోహత్యాకాండని ఎవ్వరు ఆపుతారు? ఏవరు గోగ్రహణం చేస్తారు?" అన్నాను.

నా కళ్ళముందు చిన్నప్పటి లేగదూడ మెదిలింది!

పురిజాల సుధాకర్
లెక్చరర్స్ సోషల్ సొసైటీ
బిఇడి కాలేజ్
మునసబ్ పేట, అరసవిల్లి (వయా)
శ్రీకాకుళం - 532 401.



కళ్ళుమూస్తే
కల్లో కొస్తావు
కళ్ళు తెరిస్తే
ఊహల్లో జీవిస్తావు!
నా హృదయాన్ని కరిగించి
ప్రమిదలో వెలిగించి
నీ ముందుంచుతాను చెలీ
నీ కన్నుల్లో కాంతుల కోసం!

-డి.శ్రీధర్,
రాయదుర్గ.